# మధ్యతరగతి చీర

(ఆంధ్రపత్రిక 1985)

'మధ్యతరగతి బ్రతుకుల్లో భేషజాలు,
వాళ్ల జీవితాల్లో చిరిగిపోని శాపాలు'

ఖరీదైన చీర కుప్పలా ఒళ్లో వేసుకుని దిగులుగా కూర్చోనుంది శ్యామల.

"అమ్మా! అమ్మా! వాకిట్లో నేను కొత్తముగ్గేశాను చూద్దువుగాని రా" తన చెయ్యిపట్టుకున్న పదేళ్ల కూతురి లేత చేతిని విసిరికొట్టింది.

ఎప్పుడూ అంతగా కోపగించుకోని తల్లి కోపానికి బెదిరిపోయి అడుగులుమెల్లిగా వేసుకుంటూ తల్లి దృష్టినుండి తప్పుకుంది పాప.

"ఏందమ్మాగోరూ! పనేళ అట్టాకూకోనున్నారు" శ్యామల తలెత్తి మరలా తలవంచుకుంది ఆమెకళ్లలో సన్నటి నీటిపొర

'ఏటయిందమ్మగోరు, ఓలమ్మో! కళ్లనీళ్లుకూడా ఎట్టుకుంటున్నారు!

ఆకాశంలో అందంగా తిరిగే నల్లటిమబ్బు తునక్కి అడివిగాలి తగిలింది, శ్యామల కళ్లు వర్షించాయి.

చేతిలో సత్తు దబర ప్రక్కనబెట్టి అక్కడే చతికిలబడింది ప్రొద్దున పాచిపని చేయడానికి వచ్చిన పాపాయమ్మ

'అయ్యగారేమైనా అనిండ్రా'

తలఅడ్డంగా ఊపి ముక్కుచీదేసిందాయింటి యజమానురాలు

'ఏటయినాదమ్మా అయితే'

"చీఱ చిరిగిపోయిందే పాపాయీ'

"ఓస్ ఇంతేనా?"

ఆల్చిప్పల్లాటి తన కళ్లను ఇంకాస్త పెద్దవి చేసి ఓస్ యింతేనా? అంటున్న పనిమనిషిని చూసింది శ్యామల. ఆ కళ్లల్లోని తడిలో విపరీతమైన ఆశ్చర్యం అంతలోనే దిగులు.

'మొన్ననే కొత్తగా కొనుక్కున్నాను. కొంత్తన్నామాయలేదు. పాడు ఎలుక కొట్టేసింది అదీ ముచ్చటయిన పవిట చెంగులో'

'పోతే పోయిందిలేవమ్మా పాడు. సీర ఇంకొకటి అయ్యగార్ని అడిగి కొనుక్కుందువుగానీ' ఓదార్చింది పాపాయమ్మ ఆ ఓదార్పుతో శ్యామల దిగులు మరీ చిక్కబడింది.

"అలాటి చీర ఇంకోటి ఈ జన్మలో మరలా కొనుక్కోగలదా?"

'దిగులట్టుకోకమ్మా! సీరకేటి ఒకటిపోతే మరోకటొత్తాది' చిరాగ్గా చూసింది శ్యామల

'నీదిపోతే నీకు తెలుస్తుందే ఆ నొప్పి'

పాపాయమ్మ పగలబడి నవ్వింది

'ఏటమ్మగోరూ! ప్రాణాలే శాశ్వితంకాదు అట్టాటిది కట్టుకొనే కోక్కొచ్చిందా? లెగండి.... లెగండి అంట్లు పడేయండి ఆపైన రంగనాయకమ్మోరింటికెల్లాలి"

శ్యామల ఒక్క ఇంచికూడా కదలలేదు

'లెగండమ్మా ఈ పొద్దు ఆయమ్మకోడలొచ్చుంది ఆయమ్మనో చిరిగిపోయిన సీరడగాల'

'పోవే వంటింట్లో సింకులో పడేసిన గిన్నెలన్నీ తీసుకుపో'

తెల్లబోయింది పాపాయమ్మ. తనని ఏకూరో, గిన్నో దొంగిలిస్తుందని బయపడి వంటింట్లో కదుగుబెట్టనివ్వని అమ్మగోరేవ్వే! అన్ని గిన్నెలు తీసుకోమనడమేవ్వే!!"

'ఏంటో!' ఆశ్చర్యాన్నుండి తేరుకుని వంటింట్లోకి నడిచింది పాపాయమ్మ

పాపాయమ్మ వెళ్లిపోయాక మరో దిగులు చుట్టుకుంది శ్యామల్ని

'ఇంటికొచ్చి ఈయనేమంటారో'?

'ఆయనా దిగులుపడ్తారు ప్పాపం ఒక్కరూపాయా? రెండు రూపాయలా? ఏడువందలా పాతిక రూపాయలు నెలంతా ఓవర్‌టైమ్ చేసి సంపాయించిన డబ్బది ఆ చీర వెనుక ఎన్ని కథలు, ఎన్ని కన్నీళ్లు!'

"శ్యామా! ఒక్క కాటన్ చీరమీద ఏడొందలు పెట్టగల శక్తికాదు మనది మంచి చీరలు నూట అరవైలోకూడా వున్నాయట అది కొనుక్కో శ్యామా!"

"ఊహు, ఈ చీర చూడండి ఎంతబాగుందో! బ్రౌన్ కలర్‌కి క్రీమ్‌కలర్ బార్డర్. ఆ గుడ్డమీద ఆ అంచు డిజైన్ చూడండి ఎలా నీడలు తేల్తుందో! "చేత్తో ఆ చీరసౌందర్యాన్ని తడిమి చూస్తూ పరవశంగా అంది తను. ఆ షాప్ కొచ్చిన అరగంటలో ఆ చీరమీద మమకారాన్ని కూడా పెంచేసుకుంది.

'బాగుంది శ్యామా! చాలా బాగుంది కానీ మనకు శక్తుండొద్దూ ఆఫ్టరాల్ నా జీతం ఎంత?"

మూతి ముడుచుకున్న త...ని ఓదారుస్తూ తనే మరలా అన్నాడు.

'చూడూ! ఆ ఎర్రంచు నలుప్ప కోటా చీర కూడా చాలా బాగుంది కదూ!'

..........

"ఎంతయ్యాఅది?"

"నూట ఎనభై అయిదు సార్"

"దాన్ని పాక్ చేయించనా?"

"ఊహు కొంటే ఇదేకొనుక్కుంటా లేకపోతే ఈ ఉగాదికి నాకు చీరొద్దు. మీరు కొనుక్కోండి" అలిగే అలవాటు అంతగాలేకపోయినా ఆ చీరమీద మోజు తననారోజు అంతవివేకహీనురాల్ని చేసింది.

పాపం ఈయన ఆరోజు కరిగిపోయారు.

"పోనీలే ఈ పండక్కి నువ్వు కొనేసుకో, వచ్చే పండక్కి నేను పిల్లలూ కొనుక్కుంటాం"

మనసు మూలిగింది.

'ఆయనకు, పిల్లలకు లేకుండానా?'

"నా దగ్గరుండే ఏడువందలాపాతికే నీ చీరకు సరిపోతుందనుకుంటా"

పాపం ముచ్చటపడ పిల్లల సంగతో! క్షణం 'వద్దులే' అనేద్దామనుకుంది కానీ అంత అందమైన చీర ఇక జన్మలో తను కొనుక్కోగలదా?'

"పర్వాలేదులేశ్యామా! పిల్లలకు నేను నచ్చజెప్తాలే ఎంతయ్యా ఆచీర" ఏడువందలా యాభై అయిదు రూపాయలా డెబ్బయి అయిదు పైసలు సార్" ఆ చీర కొసన కట్టబడిన స్లిప్ చూపిస్తూ అన్నాడు షాపతను

తన గుండెల్లో మరలారాయి

"ఇలాంటి డిజైన్ యింకాస్త తక్కువ రకం గుడ్డలో వుంటే చూపండి"

వద్దులెండి పారిజాతమ్మ నడిగికొరవది ఇప్పించేస్తాను. వచ్చేనెల సరుకులు కాస్త తగ్గించి తెప్పించి అప్పు తీర్చేస్తాను'

అయిష్టంగా ముఖం పెట్టారాయన

సరుకులు తగ్గించి పిల్లల నోటి దగ్గర తిండి తన చీరరూపంలో... ఆ ఊహ ఆ తర్వాత తనకే నచ్చలేదు.

'అదే డిజైన్ ఉండదండీ'

ఆయన సైలెంట్‌గా కూర్చుండిపోయాడు.

ఆయన్ని చూసి బాధేసింది.... జాలేసింది కూడా

'పదండి వెళ్తాం...'

ఆయన ఏదో అనబోతున్నారు

"ఏడు వందలా పాతికివ్వండి.... చీర ప్యాక్ చేయానా?"

ఇద్దరం తర్జనభర్జనపడ్డాం ఇంత పెద్ద షాప్‌లో కూడా బేరాలా?

గతంలోకెళ్లినా ఇంకా ఆ చీరను తడుముకుంటూనే వున్న శ్యామల చటుక్కున చెయ్యిలాగేసుకుంది. చీపురుముల్లు, ముల్లురాగి బయటపడేసింది కానీ గుండెల్లో ముల్లు కంటిలో నలకలా అలాగే వుంది.

'ఏమంటారో ఈయన'? ఆరోజు రిక్షాలో కూర్చుంటూనే అన్నారుకూడా

"కాటన్ చీర మీద ఏడువందలా పాతిక చాలా పెట్టేశామనిపిస్తోంది శ్యామా అదే

సిల్కుచీరయితే సరేగానీ

తను నవ్వుకుంది ఆయనింకా పాత రోజుల్లోనే ఉన్నారు

ఈ రోజుల్లో కాటన్ చీరలు ధర ఎక్కువ నైలాన్ చీరలకంటే పాత రోజుల్లో అయితే సిల్కుచీరంటే ఖరీదెక్కువ కాటన్ అంటే ఖరీదు తక్కువ అని లెక్క. కాటన్స్‌లో ఎన్ని రకాలు. నీడలు తేల్తూ, ఎంబ్రాయిడరీ వర్కుతో, పాలనురుగు మీద ఇంతు చల్లినట్టున్న తెల్లటి మృదువైన కాటన్ చీరల్లోనే వుంటున్నారు కార్లలో వచ్చే గొప్పింటమ్మాయిలు తనంత గొప్పదికాదుకానీ అలాంటి చీర ఖరీదైనా కొనుక్కోగలిగింది.

పోనీలే నీ ముచ్చట తీరింది కానీ జాగ్రత్తగా వాడుకో మనశక్తికి మించి కొనుక్కున్నాం.

అలా ఆయన జాగ్రత్తచెప్పి పదిరోజులు తీరాకాలేదు. వెధవ ఎలుక ఎక్కడినుండి వచ్చిందో! ఏ చీరా దొరకనట్టు దండెం మీద అన్ని గుడ్డలుంటే దీన్నే కొట్టింది. వచ్చి చూసి ఏం ఫీల్ అవుతారో!

ఒళ్లోకి చూసుకుంది శ్యామల ఉల్లిపొరలాంటి బ్రౌన్‌చీర కాటన్ సిల్కు పోగు మిక్స్ అయిందేమో తాకితే మెత్తగా ఉంది. ఈ మధ్యే స్నేహితురాలి రిసెప్షన్‌కెళ్తే ఈ చీరకట్టుకుని వెళ్తే అక్కడా అందరి ఒంటిమీద ఇలాంటి చీరలే, వాళ్లంతా పెద్ద బిజినెసం మాగ్నెట్స్ భార్యలు, తననీ ఈ చీరలో చూసి ఏ గొప్పింటి ఆడబడుచో అనుకోనుంటారు.

కానీ చీర చిరిగిపోయింది. పవిట్టుచెంగు అందాన్ని పోగొట్టేసింది. ఏవిధంగా కుట్టి అందంగా కట్టుకోడానికి కుదరనట్టు చిరిగేసింది. అనే కంటే మధ్యలో గుడ్డ కొరికేసిపారేసిందంటే సబబుగా ఉంటుంది. డార్నింగ్ చేయించడానికి, పేచ్‌వర్కు చేయించడానికే వీలులేకుండా ఉంది.

---

'ఒళ్లు దగ్గర పెట్టుకుంటే ఇట్టాటివి జరగవు' మూర్తి పదినిముషాలనుండి భార్యను నసపెడుతూనేవున్నాడు.

"నేనేం చేశాను ఆ ఎలుకనొచ్చి కొట్టమన్నానా?" విసిగిపోయిన శ్యామల తనమౌనాన్ని బద్దలు కొట్టింది.

"అంత ఖరీదైన చీర కావాలని కోరుకుని కొనుక్కోవడంకాదు. వాడాక మడతేసి బీరావాలో పెట్టుకోవాలి దండెంమీద వేసిందంట దండెమీద'

'నేను కలకన్నాను కాబోలు ఎలుకలు కొత్తగా మనింట్లో కొస్తాయని'

'ఆరోజు నాస్తోమతకు మించి నీకాచీరకొనిచ్చాను పిల్లలకు కూడా తేకుండా'

'కొనిచ్చారు కాదన్నానా? అది చినిగిపోయిన దానికి నాకు మాత్రం దిగుల్లేదూ!" కాస్త తగ్గుతూ అంది శ్యామల.

"దిగులున్నదానివయితే ఇంత నిర్లక్ష్యంగా వుండవు"

"గట్టిగా అరవకండి ప్రక్కవాటావాళ్లు వింటారు"

అసలే తను బాధపడి మనసు చెదరగొట్టుకుంటుంటే ఈయనదొకటి మధ్యలో అటు తిరిగి పడుకుంది శ్యామల. ప్రక్కనే కుర్చీలో కుప్పగా పెట్టిన కోరాకాటన్ చీర మనసు పడికొనుక్కున్న చీర, ఓ మధ్య తరగతి వ్యక్తి నెల సంపాదనలో పాతికోనవంతు ఖరీదు చేసే చీర ఆ చీరను చూస్తుంటే దిగులు. ప్రియమైన వ్యక్తి చనిపోయినంత దిగులు.

తీరా తెల్లవారకముందు గుడిశలో ఏదో తగువు గందరగోళం

'ఒసే నీకు ఒళ్లంతా పొగరే లేకపోతే బంగారం లాంటి సీరను ముళ్లమీదారేసి లాగి

సింపేస్తావా?'

'సూళ్లేదు'

'ఒళ్లు దగ్గరుంచుకుంటే సూస్తావ్'

'మాసెప్పొచ్చాడు ఒళ్లు దగ్గరట్టుకోలేక ఎక్కడట్టుకుంటానో! ఈడుకాని కొనిచ్చినట్టు అంకమ్మ శివాలు, సంపాయించిందంతా ఆ తాగుడుకి ఎట్టనేసొబ్బు' పాపాయమ్మ గొంతెత్తిండి చీరపైకి దోపింది.

"ఏం తాగితే... నీకు పోయిన సంకరాత్రికి నల్లసుక్కల సీరకొనీలా?'

"ఆ మా సంబడం! కొనిచ్చావు జనమకో శివరాత్రిరి ఇది నువ్వు కొన్నావా?'

"కొనలేదూ... అయితే సింపుకోవాలసుందా" పైపైకి వచ్చి కొట్టబోయాడు వీరిగాడు. ప్రక్కన చోద్యం చూస్తున్న జనం సరదాపడి వాడిని వెనక్కు లాగారు.

"కొడ్తావంటారా తాగుబోతోడా... ఈ సీర నీ యబ్బసొత్తుకాదురా నా రెక్కలు కష్టం ఆయమ్మనీ, ఈయమ్మనీ అడుక్కొచ్చుకున్నయిరా. ఈ సీరని సింపుకుంటాను, దానం చేసుకుంటాను నువ్వెవరివిరా అడగడానికి?"

'నీ మొగ్గుణ్ణి' మరో అడుగు ముందుకేశాడు వీరిగాడు

'ఆ మొగుడు.... చట్టుబండలు'

'ఏం మొగుణ్ణికాదా నన్నొగ్గేసి ఆ సామిగాణ్ణి మారు మనువాడ్తా'

'నాను మనువాడ్తానో, వురేసుకుంటానో ఎదవా! నా బతుకుమీద నీ జులం ఏవిట్రా సంపాదించి పోస్తున్నట్టు' తుపుక్కున ఉమ్మేసి లోపలికెళ్లిపోయింది పాపాయమ్మ.

అంతవరకు చుట్టూచేరి ఆనందిస్తున్న జనం ఆ సీను మరో పది నిముషాలు పొడిగించబడనందుకు బాధపడి తమ తమ గుడిసెల్లో దూరేశారు.

రెండు రోజులయిపోయింది కూడా ఎందుకో ఈ అలక? ఆఫీసు నుండి వచ్చేసరికి కాసిన్ని మల్లెపూలన్నా తల్లో పెట్టుకోవడం లేదీరెండు రోజులనుండి. అన్నం వడ్డించినా పరాయి వక్తికి వడ్డించినట్లే... ఆ పాపాయమ్మ చూడు అరిచింది మరో గంటకి వాణ్ణి పిలిచి గంజిపోసింది ఇద్దరూ కలిసి నిన్న సినిమాకి కూడా వెళ్లిపోయారు.

నిట్టూర్చాడు మూర్తి... పోనీ తనే పలకరిస్తే ఎక్కడో ఇంకా మిగిలిపోయిన అహంకారం

ఏదో బంగారం లాంటి చీర చినిగిపోయిందనే కోపంతో ఓ మాటన్నాడనుకో అంతమాత్రానికే అంత పట్టుదలా?

పాపం తనూ బాధలో వుండింది తను కాస్త ఓదార్చివుండాల్సిన మాట.

'పోనీ అలాటిది యింకొక చీర కొనిస్తే.... డబ్బెక్కడిదీ?.

మూర్తి అలా ఆలోచిస్తుండగానే భోజనానికి హాస్టల్ బెల్ లాంటి పిలుపు. మరలా అతనిలో అహంకారం

"ఎక్కడమ్మా గోరూ పయాణమయ్యారు?'

"పార్వతి పిలిచింది. రెండు రోజులనుండి వాళ్ల పనివాడిని పంపుతోంది అమెకు పిండి ఒడియాల్లకు పిండి వుడకబెట్టేది తెలియదంట"

'ఎప్పుడొస్తారమ్మా ఆలీసం అయ్యేపనయితే నాకు కాసిన్ని మజ్జిగెయ్యండమ్మా ఈ రోజు కడుపులో మంటగా ఉంది'

"పోస్తానుండు"

"ఆరోజు చిరిగిపోయిందే ఆచీరకట్టుకుని పోండమ్మా బాగుంటది మానిపోతున్న

గాయానికి మరలా దెబ్బ తగిలింది.

"లేదే అదింకా కుట్టించలేదు"

"అదేంటీ నిలువుగా చింపేశావు అంత ఖరీదైన చీరను?" ఒడియాలు పెట్టడం పూర్తిచేసి చెయ్యికడుక్కుని చీరకొంగుకు తుడుచుకుంటూ అడిగింది శ్యామల పార్వతిని.

"చింపెయ్యలేదు శ్యామలా! ఐరన్ చేస్తుంటే నిప్పురవ్వ పడిందని తెచ్చి చూపించాడు లాండ్రీ వెధవ చీర మధ్యలో నల్లగా చుక్కలా కాలింది. ప్లెయిన్ చీరకదూ నడిచేప్పుడు కుచ్చిళ్ళు అటూ యిటూ కదిలి అసహ్యంగా కన్పిస్తుందని, రెండుగా చింపేశాను. ప్రింటెడ్ చీర తెప్పించి ఇలాగే రెండుగా చింపి రెండిటినీ అతుకేసి రెండు చీరలు చేసి చెల్లెలికొకటి పంపిస్తాను" అది ఫ్యాషన్ ఇప్పుడు.

"చాలా ఖరీదైన చీరలా ఉంది బావుంది"

'అవును' చేతిలో చీరను అటు ఇటు తిప్పి ఏ రంగు ప్రింట్‌తెస్తే బావుంటుందా? అని చూస్తోంది పాతికేళ్ళ పార్వతి నెలకి బిజినెస్‌మీద పదివేలన్నా సంపాయించే మాధవరావు భార్య.

'మరలా ముందేసుకు కూర్చున్నావా ఆ చీరను ఇక నాగతి అధోగతే. ప్రొద్దుటినుండి ఒక ముద్దన్నా ఇవ్వలేదు కొత్తచీర కొనుక్కోవచ్చులెద్దూ! అదెవరికైనా పడేయ్'

ఉషారుగా అక్కడికొచ్చిన మాధవరావు నోరు మూతపడిపోయింది. ఈ ప్రక్కగోడకు బల్లిలా అతుక్కుపోయిన శ్యామలను చూసి

'సారీ' అతను వెనక్కితిరిగి వెళ్ళిపోయారు.

"రేపు ఎండాక నీకు ఒడియాలు పంపిస్తాను"

'అబ్బెబ్బే వద్దొద్దు మా ఇంట్లో డబ్బాలనిండా అవే' అనేసి పార్వతి టిఫిన్ తిని వెళ్ళవుండు అంటున్నా వినకుండా ఆ యింటి బయటకొచ్చేసింది. నిజానికి ఒడియాలు ఇంట్లోనిండుకుని నెలయింది. ఆమె చెవుల్లో మాధవరావు మాటలే గింగురమంటున్నాయి.

'కొత్తచీర' కొనుక్కోవచ్చు లెద్దూ అదెవరికైనా పడేయ్'

తన భర్తా నెలకు పదివేలు సంపాయించే మాధవరావయ్యుంటే

'కొత్తచీర కొనుక్కోవచ్చులెద్దూ అదెవరికైనా పడేయ్ ఈ రాత్రిని వృధాచేయకు అనేవాడే'

ఈ రోజుల్లో నెలకు కేవలం చిల్లరసామానుకు ఇంటి బాడుగకు పూర్తిగా సరిపోని అంకె తెచ్చుకుంటున్న మనిషి తన భర్త

అందుకేపాపం గుండెల్లో నుండి పొంగిన బాధను తన మీదకు విసిరేసి ఒకటి కాదు నాలుగు రోజులు మానసిక శిక్ష అనుభవించాడు. ఎవరికి మాత్రం వుంటుంది ప్రేమించే భార్యను నొప్పించాలని.

అదే పరుగుతో ఇంట్లోకొచ్చి పడినేరుగా బాత్‌రూమ్‌లోకి దూరింది శ్యామల

తలలో మల్లెపూలతో, పెదాలమీద సుందరమైన చిరునవ్వుతో వాకిట్లో కొచ్చిన భార్యనుచూసి మూర్తికి మతిపోయింది.

మరోనిముషంలో అతని చేతులు ఆర్తిగా ఆమెను చుట్టుకుపోయాయి.